# సత్యవాక్యం

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

APRIL -1998

## సంక్షిప్త వార్తలు

1998 ఫిబ్రువరి 26వ తేదీ గురువారంనాడు పశ్చిమగోదావరి జిల్లా కరుగోరుమిల్లి గ్రామంలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు రిబ్బను కత్తిరించగా తెరువబడెను. ఆ దినమున స్థానిక క్రీస్తు సంఘస్థులు, పరిసర సంఘ సభ్యులు, స్థానికులు అనేకులు కూడి రాగా రోయస్ గారు చక్కని వాక్య పరిచర్య గావించిరి. 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కరుగోరుమిల్లిలో సోదరులు N. మోజెస్‌గారు సువార్త చాటుచున్నారు.

1998 మార్చి 20వ తేదీ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా సత్తెమ్మ చెట్టు గ్రామములో సువార్త కూటము జరిగెను. సోదరులు E.K.V. ప్రసాద్, బూలయోహాను గార్లు వాక్యపరిచర్య చేయగా 4 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మెట్టలంక, సత్తెమ్మ చెట్టు గ్రామములలో సోదరులు V.V. రాఘవులు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

మార్చి నెల సువార్తికుల సదస్సు 27వతేదీ శుక్రవారం మండపేట న్యూకోలనీలో కొల్లి కామేశ్వరరావ్‌గారి యింట కూడుకొనుచున్న క్రీస్తుసంఘ ఆధ్వర్యమునఘనంగా జరిగెను. ఉభయగోదావరి జిల్లాలనుండి అనేకమంది సువార్తికులు హాజరుకాగా, "లేఖనముల ప్రాముఖ్యత యేమి క్రైస్తవుడు లేఖనముల అధికారమునకు లోబడి యుండవలెనా ?" యను అంశము చర్చించబడెను.

సదస్సుకు సోదరులు V. చిన్నయ్య గారు అధ్యక్షత వహించి సమర్ధవంతముగా నడిపించిరి. బూల రవిశాస్త్రిగారి ప్రార్థనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు G. షడ్రక్, V.చిన్నయ్య, M. జోసఫ్, R. బెనర్జీ, V. పాల్ విక్టర్, N. రాజారావ్, V. V. రాఘవులు, N. ఏలియా, జాషువా గూటం, బూల యోహాను గార్లు చర్చలో పాల్గొనిరి.

లేఖనములు అనగా లిఖింపబడి గ్రంధస్థము చేయబడిన దేవుని వాక్యం.

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

| సంపుటి 18 | ఏప్రియల్ 1998 | సంచిక 9 |
|---|---|---|


## సంపాదకీయం

## బైబిలు-దేవుని వాక్యము

( The Bible - the Word of God )

బైబిలును గూర్చి నీ భావమేమిటి ? అది ప్రపంచములో అత్యధికముగా అమ్ముడగుచున్న గ్రంధమని నీకు తెలుసా? అది వందల కొలది భాషలలోనికి తర్జుమా చేయబడినది. ప్రపంచమందున్న మిగతా భాషలన్నిటిలోనికి దానిని తర్జుమా చేసేపని ప్రస్తుతము కొనసాగుచుయున్నది.

ఈ గ్రంధమును గూర్చిన అనేక ప్రాధమిక విషయములను నేను నీతో పంచుకొనగోరుచున్నాను. నీకు ఇంకా ఒక బైబిలుగాని క్రొత్త నిబంధనగాని లేని యెడల దాని కాపీ నొకదానిని నీవు సంపాదించుకొనుట మంచిది.

మొదటిగా, బైబిలు దైవాత్మావేశ లేఖనమైయున్నది. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించు

కొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2పేతురు 1:20,21). దేవుని చిత్తమును లిఖించుటలో పరిశుద్ధాత్ముడు కొందరిని ఎన్నుకొని వారిని నడిపించెను. ఆ లేఖనములు భద్రపరుపబడి మానవజాతి కంతటికీ లభ్యపరుపబడినవని దీని యర్థము. ఈ గ్రంథమును చదువునప్పుడు మనము కేవలము మానవమాత్రుల ఆలోచనలను, వ్రాతలను గాక దేవుని యొక్క చిత్తమునే చదువుచున్నామని దీని యర్థము. అందువలననే మనము దానినిగౌరవించి దాని బోధలకు లోబడవలెను. అపొ.పౌలు ఈ విధముగా చెప్పి దీనిని బలపరుచు చున్నాడు: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజన కరమై యున్నది" (2తిమోతి 3:16,17).

రెండవదిగా, ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును. అపొస్తలుడైన పేతురు ఇట్లనుచున్నాడు: "మీరు క్షయబీజము నుండి కాక, శాశ్వతమగు జీవము గల దేవుని వాక్యమూలముగా అక్షయబీజము నుండి పుట్టింపబడిన వారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనినవారై యుండి, యొకనినొకడు హృదయ పూర్వకముగాను, మిక్కుటముగాను ప్రేమించుడి. ఏలయనగా, సర్వశరీరులు గడ్డిని పోలినవారు, వారి అందమంతయు గడ్డి పువ్వువలె ఉన్నది; గడ్డి ఎండును. దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును. మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" (1పేతురు 1:22-25) "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" అని క్రీస్తు చెప్పెను (మత్తయి 24:35). మానవ లిఖిత గ్రంథములకు అంతమేలేదు. అయితే అవి వచ్చిన రీతిగనే వెళ్ళిపోవును. ప్రసిద్ధి గాంచిన పుస్తకములు కూడ కొంతకాల మయ్యేసరికి వాడిపోవును. అయితే దేవుని వాక్యమైన బైబిలు మాత్రము అట్టిదికాదు. అది పరిశుద్ధ గ్రంథము. అది మానవునికి దేవుడిచ్చినది. అది అంతయు

దైవావేశమువలన కలిగినది. ఈ జీవితంలో మానవుని మార్గదర్శియై అతనిని పరలోకమునకు తీసికొని వెళ్ళుటకది ఉద్దేశించబడినది. అనేక సంవత్సరముల తరబడి నిలిచినట్టిది ఈ గ్రంథము. అది నిత్యము నిలుచునని ఎన్నడు నాశనము గావించబడదని ప్రభువే చెప్పెను. అది మానవుని ప్రాథమిక అవుసరములను తీర్చునట్టియు, అతనిని దేవుని యొద్దకు నడిపించుటకు ఉద్దేశించబడినదియు గనుక, ఈ గ్రంథముల మార్పు అవసరతగాని, దానిని సవరించు అవుసరత గాని లేనేలేదు. అందువలన అది సజీవమై యున్నది.

మూడవదిగా, మనము లేఖనములను చదివి పరిశోధించవలెను. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని అపో.పౌలు యౌవన సువార్తికుడైన తిమోతిని హెచ్చరించెను (2తిమోతి 2:15). "లేఖనముముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు, అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యని యేసుక్రీస్తు చెప్పెను (యోహాను 5:39). దేవుని వాక్యమును చదువుట వలన, దేవుని చిత్తమును తెలిసికొనుటకు ఆసక్తి కలిగి లేఖనములను పరిశోధించుటవలనే మనము సత్యమున తెలిసికొని దానికి విధేయులము కాగలము. మనకు ఆ గ్రంథము లభించుట ఎంత ఆశ్చర్యకరమైన సంగతి!

నాలుగవదిగా, దేవుని వాక్యమునకు కలుపకూడదు, తీసివేయకూడదు అని మనకు హెచ్చరిక ఈయబడినది. అపో.యోహాను ఇట్లు వ్రాసెను: "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును. ఎవడైనను ఈ ప్రవచన గ్రంథముమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును" (ప్రకటన 22:18,19). దేవుని వాక్యమునకీయవలసిన

గౌరవమును ఈ మాటలు మరింత దృఢపరచుచున్నవి. బైబిలు దేవుని నుండి కలిగినది గనుక ఎవడైనను దానిని కలిపినా మార్చివేసినా దేవుడు వానిని సహించడు. అది ఉన్న రీతిగనే ఉంచబడవలెను. దానికి వేరుగా చేసినయెడల దాని పర్యవసానము నెదుర్కొనవలెను.

అయిదవదిగా, దేవుని మహిమ ఘనతల నిమిత్తము ఫలములు ఫలించునట్లు స్త్రీ-పురుషుల హృదయములలో నాటబడిన విత్తనము దేవుని వాక్యమని చెప్పబడినది. "విత్తనము దేవుని వాక్యము" అని క్రీస్తే చెప్పెను (లూకా 8:11). ఆ విత్తనము పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్యమునే జనింపజేయును. అది ఆత్మఖడ్గమని కూడా చెప్పబడినది (ఎఫెసీ 6:17). అందువలన హెబ్రీ పత్రిక లేఖకుడు ఇట్లనుచున్నాడు: "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలము గలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12). దేవుని వాక్యము మంచి చెడుగుల విచక్షణ చేయగలదని, అది వాడియైనదని, శక్తిగలదని ఇరువైపుల తెగ నరుకుచు దూరగలదని దీని భావము. దానిని సరిగనుపయోగించిన యెడల ఒకని జీవింపజేయుటకు, సంరక్షించుటకు అది ఉపయోగపడును అయితే అజాగ్రత్తగా వినియోగించిన యెడల అది నాశనము కావించు సాధనమగును.

ఆరవదిగా, మనము వాక్య ప్రకారము ప్రవర్తించువారై యుండవలెనని బోధింపబడినది. "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చు కొనకుండ వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి. ఎవడైనను వాక్యమును వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తనసహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికిపోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా. అయితేస్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలుకడగా ఉండు వాడెవడో వాడు విని మరచువాడుకాక క్రియను చేయువాడై యుండి తన క్రియలో ధన్యుడు

అగును" (యాకోబు 1:22-25). ఆత్మ యొక్క అద్దము దేవుని వాక్యమని ఈ వచనములలో లేఖకుడు చెప్పుచున్నాడు. ఒకడు అద్దములో చూచుకొనినప్పుడు తానున్న రీతిగనే తన్ను తాను చూచుకొనునని మన మెరుగుదుము. తన ఆకార మెట్టున్నదో తెలిసికొనుటకు అతడు దానియొద్దకు పదేపదే వెళ్లుచు యుండును. అతడు అద్దము యెదుట నుండి కొంత కాలము దూరమైపోయినయెడల తన ఆకారమెట్లున్నదో అతడు చివరకు మరచిపోవును. ఆత్మీయ అద్దమునుగూర్చి కూడ ఈ సంగతి సత్యమే. ఒకడు దేవుని వాక్యమైన అద్దములోనికి చూచుచుండగా అతడు తన ఆత్మీయస్థితిని, అవుసరములను చూచుకొనగల్గును. అతడు దేవుని వాక్యమును విడచిన యెడల అతడా అవుసరములను మరచిపోవును, నశించిపోయే ప్రమాదములో యుండును. అందువలన దేవుని వాక్యములో నిలిచి యుండుడని, వాక్యమును బట్టి ప్రవర్తించుడి యని యాకోబు మనలను హెచ్చరించుచున్నాడు, అట్లు చేసిన యెడల మనము దీవించబడగలము. దేవుని వాక్యము ఆత్మయొక్క అద్దము అనే భావము 1కొరింథీ 13:12లో కూడ వ్యక్తపరచబడినది.

ఏడవదిగా, వాక్యమనే పాలను గూర్చి వాక్యమనే బలమైన ఆహారమును గూర్చి దేవుని వాక్యము చెప్పుచున్నది (1పేతురు 2:2; హెబ్రీ 5:14). ఒకడు తిరిగి జన్మించినప్పుడు అతడు నూతనసృష్టియగును. అతడు ఎదుగునట్లు అతనికి వాక్యమనే పాలు లేదా దేవుని వాక్యమునందలి సూక్ష్మబోధలు అతనికి అవుసరము. దీనివలన ఒకడు చివరిగా వాక్యమనే బలమైన ఆహారమును పొందగలడు లేదా దేవుని వాక్యమునందలి లోతైన మర్మములను గ్రహించుకొనగలడు. తద్వారా అతడు సంపూర్తిగా ఎదిగిన భావయుక్తమైన క్రైస్తవుడు కాగలడు.

ఎనిమిదవదిగా, దేవుని ఆజ్ఞలకు విధేయులైన వారు ఆశీర్వదించబడుదురు అని వాగ్దానము చేయబడినది. "జీవ వృక్షమునకు హక్కుగలవారై, గుమ్మముల గుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకు కొనువారు ధన్యులు" (ప్రకటన 22:14). వీటిలో సువార్త ఆజ్ఞలు (మార్కు 16:15,16), మరియు క్రైస్తవ జీవనమును గూర్చిన ఆజ్ఞలు ఇమిడి యున్నవి.

తొమ్మిదవదిగా, దేవుని వాక్యమువలన మనకు తీర్పుతీర్చబడును; క్రీస్తు ఇట్లు అనెను: "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). దేవుని వాక్యము చాల తీవ్రమైనది. ఒకనాడు అది మనలను పరిగణించును. అది ఇప్పుడెట్లు ఉన్నదో అట్లే అప్పుడు ఉండును. దానిని ఈ జీవితములో మనము నిర్లక్ష్యము చేసిన యెడల, నిరాకరించిన యెడల, అవిధేయత చూపిన యెడల తీర్పుదినమందు అది మనలను శిక్షించును. దానిని మనము విశ్వసించి, విధేయత చూపి, దానికి నమ్మకముగా యున్న యెడల అది మనలను రక్షించి పరలోక గృహము సనుగ్రహించును. ఈ పర్యవేక్షణను బట్టి ఆ దినమందు దేవుని వాక్యము నిన్ను నన్ను ఎట్లు పరిగణించును ?

పైన చెప్పబడిన అంశములు బైబిలు దేవుని వాక్యమనే సత్యమును మరొకసారి వక్కాణించుటకును, పాఠకులు దానిని తీవ్రముగానెంచి దానిని చదివి, ధ్యానించి, సరిగనుపయోగించి దాని హెచ్చరికలను గైకొనవలెనని తెలియజేయుటకును చెప్ప బడినవి. దాని గ్రంధకర్తయైన దేవుడు ప్రయోజనము లేకుండా దానిని మనకీయలేదు గాని మనలను ఆయనకును ఆయన చిత్తమునకును పరచయము చేయుటకు, మనము నడువవలసిన మార్గమును మనకు చూపుటకు దానిని విశ్వసించి దానికి లోబడువారికి అది జీవము నీయగలదు. గనుక దానిని మనము దాచుకొనవలెను, గౌరవించవలెను, మన జీవితములను మార్చుటకు, మరల్చుటకు, దేవుని చిత్త ప్రకారము ఉండువారిగా మనలను తయారుచేయుటకు దానికి తావీయవలెను. దేవుని వాక్యమైన బైబిలుతో సరి సమానముగా యున్న గ్రంధమేదీ కూడా ఈ లోకములో లేదు. దానిని పరిశోధించి నీకు నీవే కనుగొనుము.

- జాషువా గూటం.

# బైబిలు నిజమా ?

## ( Is the Bible True ? )

"ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2పేతురు 1:21).

## నేను బైబిలును నమ్ముదును

దానిని విశ్వాసము వలన నేనంగీకరింతును. నేను మరణానంతరము జీవించుదునని అది బోధించుచున్నది. నేనొక శ్రేష్ఠమైన గృహమునకు వెళ్ళదలచు కొంటిని, నాకంటె ముందు వెళ్ళిపోయిన మిత్రులను బంధువులను కలసికొనవలెనని నేననుకొనుచుంటిని. బైబిలు నిజమని నా చిన్నతనము నుండి నాకు బోధింపబడినది. గతంలో యున్న గొప్ప పురుషులు బైబిలును అంగీకరించిరి. దానిని నమ్మకుండుట కంటే, నమ్ముటయే సులువు.

## నేను దేవుని నమ్ముదును

నాస్తికత్వము నిరూపింపబడలేదు. దేవుడు లేడని తెలిసికొనుటకు ఒకడు సమస్తమును ఎరిగి యుండవలెను. దేవునియందు నమ్మికయుంచుట చాల యోగ్యమైనది. దేవుడు లేడని నమ్ముట చాలా అయోగ్యమైనది. ఆయన ఉనికిని గూర్చి ఈ విశ్వము సాక్ష్యమిచ్చుచున్నది. ప్రతి యిల్లును ఏదైనా ఒకనిచే నిర్మింపబడి యున్నది. గడియారమును తయారుచేసిన జ్ఞాని అంటూ ఒకడున్నాడు. దేవుడు చేసిన వాటిని బట్టి దేవుని గూర్చి మన మెరుగుదుము. ఆకాశమును ప్రకృతిని మరియు ఒక పసిబిడ్డ ముఖమును ఒకసారి తిలకించి దేవుని పరికించుము. దీనియంతటి వెనుక ఒక గొప్ప నమూనా కారుడు (Designer), సాంకేతిక విజ్ఞాన కోవిదుడు ఉన్నాడు. దీని గత్యంతరము ఏమిటి ? నిరీక్షణ శూన్యము, జీవించుటకుగల లక్ష్యము సున్న. అది ఎంత భయంకరమైన, నిర్జీవమైన దృశ్యమో !

## ' దేవుని చూపించు నేను నమ్మెదును '

పై విధముగా కొందరు వాదించుదురు. నీ మెదడు చూపించు అప్పుడునీకు కొంత మెదడున్నదని నమ్మెదును ! గాలిని చూపించు అప్పుడు దానిని నమ్మెదును. మహాత్మగాంధిని చూపించు అప్పుడాయన జీవించాడని నేను నమ్మెదును.మనము ప్రాణాన్ని గాక దాని ఫలితములను చూచుచున్నాము. అట్లే నీ మెదడు యొక్కయు, గాలియొక్కయు, గాంధీయొక్కయు పనిని మనము చూడగల్గుచున్నాము. దేవుడు చేసినవాటిని బట్టి మనమాయనను చూడ గల్గుదుము. ఆయన ఉనికిని గూర్చిన ఋజువులను ప్రతిచోట మనము చూచుచున్నాము.

## విచిత్రమైన బైబిలు లక్షణములు

కాలారంభమునుండి నిత్యత్వము వరకు అది మన మార్గదర్శియై యున్నది (కీర్త119:105). అది ఎన్నడు నాశనము గావించబడదు (మత్తయి 24:35), ప్రతి సత్కార్యమునకు అది సంపూర్ణమై యున్నది (2తిమోతి 3:16). అది దేవుని నుండి కలిగినది (హెబ్రీ 1:1,2). అది మానవుని ఆద్యంతములను, అతని కృషిని, గమ్యమును బయలుపరచుచున్నది. మరో గ్రంధమేదియు వీటిని బయలుపరచలేదు. అది కాలపరీక్షలను జయించినది. వోల్‌టయిర్, పేయిన్, ఇంగెరుసాల్ లాంటి వ్యక్తులు దానిని నాశనము చేయబూని విఫలులైరి.

## బైబిలు లేఖకులు

బైబిలు 40 మంది లేఖకులచే 1600 సంవత్సరములో వ్రాయబడెను. అది ఒకే సంపుటియైనను దానిలో 39 పుస్తకములు గల పాత నిబంధన, 27పుస్తకములు గల క్రొత్త నిబంధన యున్నవి. దాని లేఖకులలో రాజులు, గొల్లలు, సైనికులు, జాలరులు, వ్యవసాయకులు కలరు. అది రాజభవనములలోను, గొల్లల గుడారముల లోను, చెరసాల గదులలోను వ్రాయబడెను బైబిలు లేఖకులు అందున్న వ్యక్తుల మంచి చెడుగులను రెంటిని గూర్చి తెలియజేసిరి. అబ్రహాము, నోవహు, దావీదు, మోషే, పేతురు లాంటివారిని గూర్చి ఉదాహరణగా ఆలోచించుము. ఆయా

వ్యక్తులలో ఎన్ని వ్యత్యాసములున్నను బైబిలు అంతయు ఒకే గ్రంథమై యున్నది. దానిలో స్వవిరుద్ధ సంగతులేమీ లేవు.

## బైబిలు ప్రభావము

దాని నైతిక ప్రభావము దేశదేశాలకు ప్రబలియున్నది. నాగరికత పయనించవలసిన త్రోవను అది చూపించినది. మానవ స్వాతంత్ర్యము అభివృద్ధి జెందినది. స్త్రీ స్థానము హెచ్చించబడినది. కృషిచేయు కార్మికునికి మద్దత్తు ఈయబడినది. కృషియే గౌరవమనే సంగతి గుర్తించబడినది. కళా సాహిత్యములు, విద్య మొదలగునవి విస్తరించబడెను. దీనికంతటికి తప్పక ఒక కారణముండవలెను. అదేమంటే బైబిలు దేవుని నుండి కలిగెను !!!

## అది రక్షణ సంకల్పమును బయలుపరచుచున్నది

"మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1కొరింథీ 15:21,22). పరదైసునుండి పరదైసువరకు చెప్పబడుచున్న కథలన్నిటికంటే ప్రఖ్యాతిగాంచినట్టిది. అది మర్త్యుడగు మానవుడు మునుపెన్నడు విననట్టి గొప్ప వర్తమానము. క్రీస్తు రక్తము ఇమిడియున్న ఈ కథలో మానవుడు రక్షింపబడవలెనంటే విశ్వాసముంచవలెనని (యోహాను 8:24). మారుమనస్సు పొందవలెనని (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనవలెనని (రోమా 10:10), మరియు బాప్తిస్మము పొందవలెనని బయలుపరచబడియున్నది (అపో.కా. 2:38).

## తీర్పు తీర్చు స్థాయి అది

"మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు

వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రకటన 20:11,12). ఆ దినమందు ఒక్కొక్కసారి పేరు పిలువబడు చుండగా మనమందరము అక్కడ యుందుము. ఇప్పుడు బైబిలులో ఏమి వ్రాయ బడియున్నదో అప్పుడు కూడ అదే వ్రాయబడి యుండును. దాని పరిశుద్ధ ఆజ్ఞల యెడల మనకున్న భావమును బట్టి మనందరి నిత్యగమ్యము నిర్ణయించబడును.

## దాగలినుండి ఒక పాఠము

"గత సాయం సమయమున కంసాలి వాని గుమ్మము దగ్గర నుండి వెళ్లుచు వాని దాగలినుండి వచ్చు ధ్వనిని వింటిని. లోపలికి తొంగిచూచి అనేక సంవత్సరముల కాలమునుండి వాడబడి అరిగిపోయిన సుత్తెలు నేలమీద పడియుండుట చూచితిని. 'ఇన్ని సుత్తెలను పడగొట్టుటకు నీవు ఎన్ని దాగళ్లు (anvils) వినియోగించితివి ? యని నేనతనిని అడిగితిని'. 'ఒకే ఒక్కటి! దాగలి సుత్తెలను అరుగగొట్టి పడగొట్టును గదా' యని అతడు ప్రశ్నించు చూపుతో జవాబిచ్చెను. అట్లే దేవుని వాక్యమనే దాగలిపై సందేహశీలురి దెబ్బలు తరములబడి పడుచునే యున్నవి. పడుచున్న దెబ్బల శబ్దము వినబడుచున్నను, దాగలికి హాని యేమియును కలుగలేదు గాని సుత్తెలు పడిపోయెను అని నేననుకొంటిని".

## ' బైబిలులో ......'

బైబిలులో దేవుని చిత్తము, మానవుని స్థితి, రక్షణ మార్గము, పాపుల నాశనము, విశ్వాసుల సంతోషము బయలుపరచబడి యున్నవి. దానిబోధ పరిశుద్ధ మైనది, ధర్మవిధులు బద్ధమైనవి, దాని చరిత్రలు యధార్ధములు, దాని నిర్ణయములు స్థిరములు. జ్ఞానివగుటకు దానిని చదువుము, సురక్షితుడవగుటకు దానిని విశ్వసించుము, పరిశుద్ధుడవగుటకు దానిని పాటించుము. నిన్ను నడిపించుటకు దానిలో వెలుగు, పోషించుటకు ఆహారము, సంతోషపెట్టుటకు ఆదరణయు ఉన్నది. అది ప్రయాణీకుని మార్గదర్శి, యాత్రికుని దండము, నావికుని దిక్సూచి, సైనికుని ఖడ్గము, క్రైస్తవుని రాజశాసనము. దానిలో పరలోకము తెరువబడెను,

నరకద్వారములు కనుబరచబడెను. క్రీస్తు దాని గొప్ప అంశము, మన మేలు దాని సంకల్పము మరియు దేవుని మహిమయే దాని ధ్యేయము. అది మన మనస్సులో నింపబడవలెను, హృదయమును ఏలవలెను, మన పాదములను నడిపించవలెను.

దానిని నెమ్మదిగా, జాగ్రత్తగా, ప్రార్థన పూర్వకముగా చదువుము. అది సంపదల గని, ఆత్మకు ఆరోగ్యము, ఆనంద నది. అది ఇక్కడ ఈ జీవితములో నీకీయబడినది, తీర్పులో తెరువబడును మరియు నిత్యము స్థిరముగా యుండును. దానిలో అత్యున్నతమైన బాధ్యత, అత్యుత్తమ పరిశ్రమకు ఫలితము ఇమిడి యున్నవి. మరియు దాని విషయములను అలక్ష్యము చేయువాని నది ఖండించుచున్నది.

మీ ఊరిలో క్రీస్తు సంఘముల కూటములకు హాజరుకమ్ము !!

**- Dr. జార్జి డిహాఫ్.**

## బైబిలు యొక్క దైవావేశము

## ( The Inspiration of the Bible )

బైబిలు మానవాలోచన యొక్క ఫలితమా ? అది కేవలము ఒక సాహిత్య గ్రంథమేనా లేక దైవావేశ సంపుటియా ? అది దైవావేశమువలన కలిగినట్లయితే ఏ రీతిగ కలిగెను ? అది ఆవేశపూరితమైతే సాహిత్య విజ్ఞులగు షేక్స్పియర్, మిల్టన్, బ్రౌనింగ్‌ల వ్రాతలలో యున్నట్టి గుణగణములు మాత్రమే అందున్నవా ? లేక పరిశుద్ధాత్మ ప్రభావమువలన మానవులచే లభింపబడిన రీతిగ అది ఆవేశ పూరితమా ?

దివ్య ప్రేరణను గూర్చిన ప్రశ్న ప్రాముఖ్యమైనది. బైబిలు దేవునివలన కలుగనట్లయితే అది చెప్పు వాస్తవములపై మనమాధారపడలేము. అధికారము కలిగియున్నట్లగుపడు దాని ఆరోపణలకు మనము తలవంచ నక్కరలేదు; మరియు

దాని వాగ్దానముల నుండి మనము ఆదరణ నిరీక్షణలను పొందలేము. అనావేశ మానవుల కృషికది సాదృశ్యముగా మాత్రమే యుంటే దానిలోని సంగతులను మనము లక్ష్యపెట్టనక్కరలేదు. అట్లుకాక బైబిలు దేవునినుండి కలిగినట్లయితే దాని యధికారము ప్రశ్నింపతగనిది, దాని యందలి సంగతులు సత్యములు.

## బైబిలు దైవావేశమును ఆరోపించుకొనుచున్నది

బైబిలు తత్వమును దానియందలి సంగతులను బట్టి అన్ని తరములలోను దాని చదువరులు దేవుడే దాని గ్రంధకర్తయని గుర్తించిరి. వ్రాయగలిగినను మానవుడటువంటి గ్రంధమును వ్రాయలేడు; అతడు వ్రాయాలనుకున్నను వ్రాయ లేడు. దాని ఆకారములోను, తత్వములోను. బోధలోను అది మానవాతీతమైనది. ఈలోకసంబంధమైన ఆశకు, ఇచ్ఛకు అది తావీయదు. మానవులు శరీర సంబంధముగా ఆశించువాటి నెక్కువ అది ఖండించుచు, వారు ద్వేషించు వాటిని శ్లాఘించుచున్నది. దాని తలంపులు మానవ తలంపులు కాదు.

అంతేకాదు, బైబిలు దైవావేశ పూరితమని తననుగూర్చి చెప్పుకొనుచున్నది. "ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు" "దేవుడు మాట్లాడెను" "యెహోవా వాక్కు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను" "అని యెహోవా సెలవిచ్చెను" అను పదములు సామాన్య చదువరులు కూడ బైబిలునందు సులభముగ్గ గమనించి హర్షించగలరు. ఈ పదజాలములు ప్రవక్తల గ్రంధములలోనే 1300 సార్లు కనబడుచున్నవి. పాత నిబంధన యంతటిలోను ఈ పదములు 2500 సార్లు కనబడుచు బైబిలు గ్రంధకర్త దేవుడేయని సూచించుచున్నవి.

బైబిలు లేఖకులు అతి స్వల్పముగా వెలిగించబడిన మానవజ్ఞాన వెలుగుతో తప్ప మరొక వెలుగుతో వారు వ్రాసినట్లు ఎన్నడు నటించలేదు. వారు పరిశుద్ధాత్మతో నడిపింపబడినవారై వ్రాసినట్లు చెప్పుకొనిరి. బైబిలు దానిలోని వివిధ భాగములు సర్వశక్తిమంతుని సహాయముతో ఈయబడెనని చెప్పియుండిరి. అపొ.పౌలు ఇట్లనెను: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు

దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమోతి 3:16,17). 'ప్రతిలేఖనము' అని పౌలు చెప్పెను. కొంత భాగము మాత్రమే దైవావేశము వలన కలిగెనను సిద్ధాంతమునతడు యెరిగియుండలేదని మనకు ఋజువగుచున్నది. ఆధునిక వేత్తలు "బైబిలులో దేవుని వాక్యమున్నది" యని చెప్పుదానికి అతడు చెప్పినది భిన్నముగా యున్నది. పౌలు ప్రకారమయితే బైబిలు దేవుని వాక్యమై యున్నది. అదంతయు దైవావేశమువలన ఈయబడెను. "ఒకడు తన ఊహానుబట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని పేతురు ప్రకటించెను (2పేతురు 1:20,21). మోషే విమోచకునిగాను, ధర్మశాస్త్రదాతగాను పనిని ఆరంభించబోవుచుండగా అతనితో దేవుడు, "కాబట్టి వెళ్ళుము, నేను నీ నోటికి తోడైయుండి నీవు ఏమి పలువలసినది నీకు బోధించెదనని అతనితో చెప్పెను" (నిర్గమ 4:12). తన జీవితాంతమందు దావీదు, "యెహోవా ఆత్మ నా ద్వారా పలుకుచున్నాడు, ఆయన వాక్కు నా నోట ఉన్నది" యని సాక్ష్యమిచ్చెను (2సమూయేలు 23:2). "ఇదిగో నేను నీ నోట నా మాటలు ఉంచియున్నాను" అని యెహోవా యిర్మియాతో అనెను (యిర్మియా 1:9). పాతనిబంధన అంతయును సత్యమని యేసు సమ్మతించెను. "మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంధములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని" ఆయన చెప్పెను (లూకా 22:44). యూదుల వాడుక ప్రకారము ఈ మూడు భాగములు, అనగా మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంధములు, కీర్తనలు అంతా కలసి పాత నిబంధన ఆయెను. అంతేకాకుండా, బైబిలు శత్రువులు ఎక్కువ ఏ భాగములపై దాడి చేయుచున్నారో బైబిలులో ఆ భాగములు సత్యములని యేసు సమ్మతించెను. సృష్టి కథనము (మత్తయి 19:8), జలప్రళయ సంఘటన (మత్తయి 24:39), మరియు యోనా తిమింగలము యొక్క కథనములు (మత్తయి 12:40) యధార్థమని ఆయన తన ఆమోదముద్రను

వాటిపై నుంచెను. అరణ్యములో ఆయన అపవాదిచే శోధింపబడినప్పుడు ఆధునికవేత్తలు ( Modernists ) ప్రశ్నించుచున్న ద్వితీయోపదేశకాండములోనున్న లేఖన భాగములనెత్తి చెప్పుట ద్వారా వానిని పారద్రోలెను. అరణ్యములో అది ఓడింపబడినప్పటినుండియు కూడ ద్వితీయోపదేశకాండము బైబిలులో యుంచబడుటకు గల అర్హతను అది తిరస్కరించుచున్నది. పంచకాండములోని ఆఖరి పుస్తకముపై యుద్ధము చేయుటకది తన నమ్మకభటులగు 'ఆధునికవేత్తలను' నియమించుచున్నది.

క్రొత్త నిబంధన వ్రాయబడకముందే దానిని కూడ యేసు ఆమోదించెను. అపొస్తలులు ఏమి చెప్పవలెనో ఎట్లు చెప్పవలెనో అను వాటిని పరిశుద్ధాత్ముడు వారికి తెలియజేయుననియు (మత్తయి 10:19), మరియు వారిని సర్వసత్యములోనికి నడిపించుననియు (యోహాను 16:13). యేసు వారికి వాగ్దానము చేసెను. పెంతెకొస్తు దినమున ఆత్మ అపొస్తలుల మీదికి వచ్చెను. ఆయన వారికిచ్చిన శక్తి కొలది వారు మాటలాడసాగిరి (అపొ.కా. 2:4). థెస్సలోనికయులు దేవుని వర్తమాన వాక్యము నంగీకరించినప్పుడు మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా యున్నట్టు దేవుని వాక్యమని దానిని అంగీకరించిరి. గనుక పౌలు వారిని మెచ్చుకొనెను (1థెస్స 2:13). అతడు మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ నేర్పు మాటలతో బోధించెను (1కొరింథీ 2:13). యోహాను వ్రాసిన లేఖనములను గూర్చి చెబుతు సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాటలను చదువరులు వినవలెనని హెచ్చరించెను (ప్రకటన 2:11). యేసు వాగ్దానము చేసిన పరిశుద్ధాత్మ నడిపింపునే తాము కలిగియున్నామని అపొస్తలులు చెప్పుకొనిరి. బైబిలు అంతయు దైవావేశము వలన కలిగినదని చెప్పుటకు యితర లేఖనములను కూడ చెప్పుకొనవచ్చునుగాని యివి చాలును.

(తరువాయి వచ్చే సంచికలో)

- **B.C.** గుడ్ పాశ్చర్.

# తీర్పుదినము
## ( The Judgment Day )

"మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). అందు నిమిత్తము క్రీస్తు మృతులలో నుండి లేపబడెను" (అపొ.కా. 10:42; 17:31).

1. ఆ దినమందు కొన్ని ప్రాముఖ్య ప్రశ్నలు :-

**A)** నీవు క్రీస్తు సువార్తకు ఎందుకు లోబడలేదు ?.

1. ఈ నిత్య హెచ్చరికలను గమనించుము : 2థెస్స 1:8,9; 1పేతురు 4:17; రోమా 1:16.

2. బైబిలు ఇప్పుడు అందుబాటులో యున్నందున, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క సువార్తకు లోబడని వాడు ఆ గొప్ప ఆఖరి దినమందు ఏమి చెప్ప గలడు?

3. ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరుచున్నాడు (2 పేతురు 3:9). ప్రతి మానవుని కొరకు యేసుక్రీస్తు మరణము అనుభవించెను (హెబ్రీ 2:9).

**B)** నీవు ప్రభువు కొరకు ఏమి చేసితివి ?

1. క్రైస్తవుడు తన కప్పగింపబడిన బాధ్యతను గూర్చి లెక్క అప్పగించవలెను (మత్తయి 25:34-45).

2. "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి... ఈ లోకములో స్వస్థ బుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండ వలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:11-13).

a) సమస్త పాపమునుండి మనము వైదొలగవలెను. అట్లయిన మనము :

b) స్వస్థబుద్ధితో జీవించవలెను-నిన్ను నీవే కాపాడుకో.

c) నీతితో జీవించవలెను-నీ పొరుగువానిని సరిగ ఆదరించు.

d) భక్తితో జీవించవలెను-దేవుని యెడల సరిగ ప్రవర్తించు. అట్లుండవలెననిన మానవుడు దేవుని చిత్తమును తెలిసికొని, దానికి లోబడి, మరణము వరకు దాని ప్రకారము జీవించుట అత్యవసరము.

3. క్రీస్తు సువార్తకు విధేయులైన తరువాత ప్రభువు కొరకు జీవించకుండా యున్నవారికి తీర్పు దినము బహు విచారకరమైనది. ఒక గొప్ప దినమురాబోవు చున్నది !!

2. తీర్పు యొద్ద కొన్ని దృశ్యములు :

A) ఎన్నడు లేనంత గొప్ప జనసమూహము అక్కడ ఉందురు.

1. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డ వైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును "క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2కొరింథీ 5:10).

2. ఆదామునుండి ఈ కాలాంతము వరకు యున్న అన్ని జాతుల వారు అక్కడ యుందురు.

3. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు అక్కడ ఉందురు. యూదా ఇస్కరియోతు, జార్జి వాషింగ్‌టన్, గాంధీ, నెహ్రూలు అక్కడ ఉందురు. నీకు అత్యంత ప్రాముఖ్యమైన సంగతి యేమంటే నీవు అక్కడ ఉందువు. ఎంత గొప్ప జన సమూహమో !

B) ఏ సింహాసనము మీద ఎన్నడు కూర్చొనలేని గొప్ప న్యాయాధిపతి అక్కడ ఉండును :

1. "ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియల చొప్పున ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది" (ప్రకటన 22:12).

2. 'ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును" (2తిమో 4:8).

3. ఈ లోకములో న్యాయము జరుగుటకు అనేక సంగతులు అభ్యంతరము కలుగజేయును. ధనము, రాజకీయ పలుకుబడి మొదలగునవి కొన్ని సందర్భము లలో మన న్యాయసభలలో అడ్డువచ్చును. అయితే ఆ తీర్పు దినమందు అది అట్లు కానేరదు.

4. ప్రతివాడును అక్కడ నిలబడును. అతడు నల్లవాడేమి, తెల్లవాడేమి, ధనికుడేమి, ధనహీనుడేమి అక్కడ నిలబడును. ప్రతివానికి న్యాయము తీర్చబడును గాని కనికరము కాదు. కనికరము చూపు దినము అప్పటికి గతించిపోవును. ఆ దినము కొరకు నీవు సంసిద్ధుడవా ?

C) గొప్ప గ్రంథములు విప్పబడును :

1. "మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను: మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథము యందు వ్రాయబడియున్న వాటినిబట్టి తమ క్రియలచొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రకటన 20:12).

2. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును" (యోహాను 12:48).

3. ఎంత గొప్ప గ్రంథముల కలయికయో! "గ్రంథములు"-బైబిలునందలి పాత క్రొత్త నిబంధన గ్రంథములు. "జీవగ్రంథము"-- మానవ చరిత్రగల పరలోక రికార్డు.

4. బైబిలులో ఇప్పుడేమి వ్రాయబడి యున్నదో అప్పుడు కూడ అదే వ్రాయబడి యుండును. ఈ దిగువ లేఖన భాగములకు నీవు లోబడితివో లేదో జీవ గ్రంథము ఏమి చెప్పుచున్నది? హెబ్రీ 11:6; లూకా 13:3; రోమా 10:10; మార్కు 16:16; అపో.కా. 2:38, 22:16; యోహాను 3:5.

D) గొప్ప ఎడబాటు అక్కడ కలుగును.

1. గొఱ్ఱెలు కుడివైపునను, మేకలు ఎడమవైపునను ఉంచబడును. ఆ దినమందు నీవు ఎక్కడ ఉంచబడుదువు ? (మత్తయి 25:31-46).

2. తండ్రి ఒక ప్రక్క, తల్లి వేరొక ప్రక్క ఉందురు; సహోదరుడు ఒక ప్రక్క, సహోదరి వేరొక ప్రక్క ఉందురు; భర్త ఒక ప్రక్క, భార్య వేరొక ప్రక్క ఉందురు. తలిదండ్రులు ఒక ప్రక్క, బిడ్డలు ఒక ప్రక్క యుందురు.

3. ప్రభువులో ఇప్పుడు అందరు రక్షింపబడి ఏకముగా నిలిబడవచ్చును.

4. తీర్పు దినమందు కలుగు ఎడబాటు అంతులేనిది. అది నిత్యఎడబాటు.

E) గొప్ప తీర్పు ప్రకటించబడును :

1. "వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు" (మత్తయి 25:46).

2. ఈ లేఖన భాగములను జాగ్రత్తగా చదువుము : లూకా 16:19-31; 12:5; ప్రకటన 20:14-15; మార్కు 9:47,48; ప్రకటన 14:11; 21:8; 22:1-7, యోహాను 14:1-3.

3. అప్పుడు మనమేమి చేతుము ?

మన పట్టణములోయున్న కారాగారములన్నియు వాటి ఆఖరి పనిని సంపూర్తి చేసిన తరువాత, వ్యాపారులు తమ పట్టువస్త్రములోని ఆఖరి మీటరునమ్మివేసి, తమ ఆఖరి గుమాస్తాను పంపివేసిన తరువాత, బ్యాంకులన్నియు తమ ఆఖరి రూపాయితో సహా వడ్డీని చెల్లించివేసిన తరువాత, ఈలోక న్యాయాధిపతి "రాత్రికి మూసివేయబడెను" అని చెప్పి లెక్కలు అడిగిన యెడల అప్పుడు మనమేమి చేతుము ? సంఘము తన ఆఖరి గీతమును పాడిన తరువాత, బోధకుడు తన ఆఖరి ప్రార్థనను చేసిన తరువాత, ప్రజలు తమ ఆఖరి ప్రసంగమును వినిన తరువాత, గాలిలో ఇక శబ్దము లేకపోయినప్పుడు, ఆరాధనస్థల మంతయు నిర్జన మైనప్పుడు గొప్ప గ్రంథములు విప్పబడగా ప్రతివాడు తన జీవిత రికార్డును ఎదురుగా చూచునప్పుడు మనమేమి చేతుము ?

మీ ఊరిలో యున్న క్రీస్తు సంఘారాధనలకు హాజరు కమ్ము !!

- W.A. బ్రాడ్‌ఫీల్డ్.

## పర్వతములు పడునప్పుడు
## ( When the Mountains Fall )

వారు సింహాసనాసీనుడైయున్న వానియొక్కయు, గొఱ్ఱెపిల్లయొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను; దానికి తాళజాలినవాడెవడు? మీరు మామీద పడి ఆయన సన్నిధికి గొఱ్ఱెపిల్ల ఉగ్రతకును మమ్మును మరుగుచేయుడి అని పర్వతములతోను బండలతోను చెప్పుచున్నారు" (ప్రకటన 6:17).

అమెరికాలో St.హెలెన్స్ అను అగ్ని పర్వతము బ్రద్దలై ఇప్పటికిని కొన్ని సంవత్సరములకు పైగా అయిపోయింది. ఆ ఏకైక ప్రేలుడు యొక్క ఘోర ఫలితములు ఇప్పటికింకను మనలను ఆశ్చర్యచకితులను గావించుచున్నవి. 50

మెగాటన్నుల బాంబుల శక్తితో ప్రేలుచు అది 150 చతురపు మైళ్ళ విస్తీర్ణము గల ప్రదేశమును నిర్జనాత్మకముగ, నిష్ఫలముగ చేసివేసింది. భూమిమీద జీవించు ఒక్కొక్కనికి ఒక టన్నుతో సమానముగ వచ్చు చెత్త చెదారమును అది వెలికి తెచ్చింది. మూడంస్థుల ఎత్తుగల పెద్ద పెద్ద బండలను గాలిలోనికి విసరివేసింది. గంటకు 800 మైళ్ళ వేగముతో వీచు 'రాళ్ళ గాలి' పెద్ద పెద్ద వ్రానులను అగ్గిపుల్లలుగా విసరివేసింది. 425 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత గల 3 బిలియన్ గ్యాలన్ల నీరు గాలిలోనికి ఆ పర్వతము ఊదివేసింది యని ఇంజనీర్లు లెక్కకట్టారు.

అడవులు, పంటలు, నదులు, జంతువుల యొక్క నాశనము లెక్క కట్టలేనంతటి దాయెను. St. హెలెన్స్ పర్వత శిఖర స్థానమునకు దగ్గరగా మకాము ఉన్న ప్రజలు కేవలము తునాతునకలైపోయిరి, మరియు దానికి 15 మైళ్ళ దూరములోయున్నవారు ఊపిరి తిరుగక చనిపోయిరి. దానికి అయిదు మైళ్ళదూరములో యున్న ఒక విజ్ఞాన శాస్త్రజ్ఞుడు తన రేడియోలో "వేంకూవర్, వేంకూవర్, ఇదే అది!" అని చెప్పెను. అవి అతని ఆఖరి మాటలు. ఏలయనగా అతడు తన కారుతో సహా మాయమైపోయెను. 1980 మేనెల 18వ తేదీ ఈ అగ్ని పర్వతము మనుష్యులపై పడిన దినము. దాని నెవరు మరచిపోగలరు?

## ఉగ్రత దినము

ప్రకటన గ్రంధములో యోహాను అట్టి ఒక భయంకర దినము యొక్క దృశ్యమును మనకు వర్ణించి యున్నాడు. ఆనాడు మానవులు పర్వతములు తమపై పడవలెనని నిజముగా ప్రార్థింతురు. "మీరు మా మీద పడుడి, మమ్మును మరుగు చేయుడి, సింహాసనాసీనుడై యున్నవానియొక్కయు, గొఱ్ఱెపిల్ల యొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను, దానికి తాళజాలిన వాడెవడు ?" అని వారు ప్రలాపింతురు. తీర్పునాడు కలుగు శిక్షకంటె మరేదైనా సరే చివరకు ఒకనిపై పర్వతము పడుటైనా సరే భరింప శక్యమైనదియని ఈ లేఖన భాగము సూచించు చున్నది.

## నిరాశ విజ్ఞాపన

ఆ దినమును గూర్చి యోహాను చేసిన వర్ణనలో సమాజములోని ప్రతివారు అనగా భూరాజులు, ఘనులు సహస్రాధిపతులు, ధనికులు, బలిష్ఠులు, ప్రతిదాసుడు, ప్రతి స్వతంత్రుడు ఇమిడియుండిరి. ఒకడు ఎంత స్వతంత్రుడైనను లేక దాసుడైనను, ఎంత ఘనుడైనను లేక ఘనహీనుడైనను అతడు సర్వజ్ఞాని యొక్క పరిశోధనలో పాల్గొనును.

నాశనమైపోవుచున్న ఈ జనసమూహముల విజ్ఞాపన ఆసక్తికరముగా యుండుట మనము గమనించగలము: "సింహాసనాసీనుడైన వాని సన్నిధి నుండి మమ్మును మరుగు చేయుడి". ఏదెను వనములో మొదటి పాపులు దేవునికి కనబడకుండా యుండుటకు ఎట్లు ప్రయత్నించిరో (ఆది 3:8), అట్లే ఆఖరి పాపులు కూడా ప్రయత్నిందురు. పాపము దుష్కార్యము చేయుచు వెలుగును ద్వేషించు వారిని దేవుని నుండి వేరుచేయును (యోహాను 3:20).

వారు తప్పించుకోవాలని ప్రయత్నించిన విధి 'గొఱ్ఱెపిల్ల యొక్క ఉగ్రత'. గొఱ్ఱెపిల్లకంటె సాధువైనది, మృదువైనది, ఉగ్రత ఆత్మకు వ్యతిరేకమైనది ఇంకొకటి యేమున్నది ? అయినను ఆ దినమందు గొఱ్ఱెపిల్లయే పగ తీర్చుటకు, ప్రతిదండన చేయుటకు ముందుగా వచ్చును. లోక పాపములను మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్లయైన యేసు, తన శరీరములో మనపాపములను భరించిన యేసు, మనకు స్వతంత్రము కలుగునట్లు తాను పట్టుబడిన యేసు, మనము విమోచింపబడునట్లు గాయపరచబడిన యేసు ఆ దినమందు అగ్ని జ్వాలలో ప్రత్యక్షమై ప్రతి దండన చేయును (2థెస్స 1:8). ఆయన రక్తపు విమోచనను నిరాకరించువారు ఆయన ప్రతి దండన భారమును భరించవలసిందే.

## పర్వతములు పడు దినము

పర్వతములు పడు ఆ దినమందు ఈ దిగువ సంగతులు జరుగును :

1. యేసు దూతల, సమూహముతో మేఘారూఢుడై వచ్చును.(ప్రకటన 1:7; మత్తయి 25:31).

2. భూమియు దానిమీదనున్న కృత్యములును అకస్మాత్తుగా నాశనము గావించబడును (2పేతురు 3:10,11).

3. సమాధులు తెరువబడును, మృతులైన వారందరు లేపబడుదురు (యోహాను 5:28, 29; 1కొరింథీ 15:51,52).

4. దేవుని న్యాయపీఠము స్థిరపరచబడును (2కొరింథీ 5:10; ప్రక 20:11,12). ప్రతివాడును తాను భూమి మీద జరిగించిన కృత్యములను బట్టి తీర్పు పొందును.

5. మానవులందరి అంత్యగతి నిర్ణయించబడి ముద్రించబడును; నీతిమంతులు పరలోకపు నిత్యానందములోనికి, దుష్టులు నరకాగ్నిలోనికి ప్రవేశింతురు (2థెస్స 1:7; మత్తయి 25:46; ప్రకటన 20:15; 21:8).

1980 మే 18 నాడు పర్వతముల యొక్క ఒక భాగము ఆమెరికాలోని ఒక రాష్ట్రములో అంత వినాశము, వేదన కలిగించిన యెడల, పర్వతములన్నియు పడు ఆ దినము ఎంత భయంకరముగా యుండునో గదా !

- పాల్ రోజర్స్.

## "యేసు వచ్చునప్పుడు..."

### ( When Christ Comes )

(యోహాను 14:1-6)

1. యేసు వెళ్ళిన రీతిగానే శరీర రీతిగ తిరిగి వచ్చును. అపొ.కా. 1:10-11.
2. ఆయన అందరికీ కనబడేలాగున వచ్చును ప్రతివారును ఆయనను చూతురు. ప్రకటన 1:7.
3. ఆయన అందరికీ వినబడేలాగున వచ్చును ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును. 1థెస్స 4:16; 1కొరింథీ 15:52.

4. అనుకొనని ఘడియలో ఆయన వచ్చును. ఆ సమయం ఎప్పుడో తండ్రియైన దేవునికి మాత్రమే తెలియును. మత్తయి 24:36-44.

5. ఆయన అకస్మాత్తుగా వచ్చును. గనుక ఆయనను ఎదుర్కొనుటకు మనం ఎల్లప్పుడు సిద్ధముగానే యుండాలి. 1థెస్స 4:16; మత్తయి 24:44.

6. యేసు తన వేవేల దూతలతో వచ్చును. మత్తయి 16:27; యూదా:14.

7. ఆయన వచ్చునప్పుడు క్రీస్తునందు మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులైయున్న పరిశుద్ధులు వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు మేఘముల మీద కొనిపోబడుదురు. 1థెస్స 4:16-17.

8. దేవుని నెరుగని వారిని సువార్తకు లోబడని వారిని ప్రతిదండన చేయటకు క్రీస్తు అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమగును. 2థెస్స 1:7-12.

9. క్రీస్తు వచ్చునప్పుడు మృతులైన వారందరు, నీతిమంతులేమి, అనీతిమంతులేమి అంధరు లేపబడుదురు. ప్రకటన 20:12-13; యోహాను 5:28-29.

10. యేసు వచ్చునప్పుడు ఈ భూమియు దానిమీదనున్న సమస్త కృత్యములును కాలిపోవును. 2పేతురు 3:7-13.

11. క్రీస్తు వచ్చునప్పుడు దేవుడు ఈ లోకమునకు క్రీస్తు ద్వారా తీర్పు తీర్చును. 2తిమోతి 4:1; అపో.కా. 17:30,31; యూదా:15; రోమా 14:12;ప్రసంగి 12:14; ప్రకటన 20:12,13.

12. క్రీస్తు వచ్చునప్పుడు నీతిమంతులను దుష్టులను వేరుచేయును. మత్తయి25:31-33.

13. ఆయనకు విధేయులైనవారిని యేసు రక్షించును. వారాయనతో కూడ నిత్యము రాజ్యము చేతురు. హెబ్రీ 5:8,9; 2తిమోతి 4:6-8; మత్తయి 28:18-20.

14. అవిధేయులను క్రీస్తు శిక్షించును. మత్తయి 7:21-23; ప్రకటన 20:14,15.

15. క్రీస్తు వచ్చునప్పుడు తన రాజ్యమైన సంఘమును తండ్రికి అప్పగించును. 1కొరింథీ 15:24; మత్తయి 16:18,19.

16. అప్పుడు కాలము ఇక లేకపోవును. ప్రకటన 22:5.

క్రీస్తురాక కొరకు సిద్ధపడియుండాలంటే నీవు క్రీస్తు సువార్తకు లోబడాలి (మత్తయి 28:18-20; మార్కు 16:15,16), నీవు క్రీస్తునందు విశ్వాసముంచాలి (యోహాను 3:16; 12:48; అపొ.కా. 16:31), పాపము విషయమై మారుమనస్సు పొందాలి (అపొ.కా. 2:38), క్రీస్తును ఒప్పుకోవాలి (మత్తయి 10:32,33; రోమా 10:9,10), మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అపొ.కా. 2:38; 22:16). మరియు యేసుక్రీస్తు ఏయే సంగతులను ఆజ్ఞాపించినో వాటన్నిటిని గైకొనుచు సమర్పణ జీవితమును జీవించాలి (మత్తయి 28:18-20; లూకా 6:46). "కావున ఏ దినమున ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా నుండిడి........ మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుకయే మీరును సిద్ధముగా నుండుడి" (మత్తయి 24:42-44, 46).

- ఆవెన్ క్రాస్‌గ్రోవ్.

ముఖ్య గమనిక : మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడు మాకు వెంటనే తెలియజేయండి. సత్యవాక్కు పత్రికపై యున్న మీ అడ్రసుపై నున్న నంబరును తప్పక వ్రాయండి. ఆ నంబరు లేనిదే మీ అడ్రసును మార్చుటకు వీలుపడదు. ఇప్పుడు సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా పది వేల గృహాలను దర్శించుచున్నది.

మీ బంధువులు, మిత్రులు బేసిక్ బైబిలు కోర్సు లో చేరేటట్లు చేయండి. వారి అడ్రసులను మాకు పంపితే వారికి పోస్టు ద్వారా బైబిలు పాఠములను ఉచితముగా పంపించెదము. బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన వారికి యోగ్యతా పత్రముతో పాటు ఒక బైబిలు ఇప్పుడు బహుమతిగా ఇయ్యబడుచున్నది.

Edited & Published by Joshua Gootam & Printed at Satya Vani, Kakinada - 533 004.

ఒకానొకప్పుడు దేవుడు మనుష్యులతో నేరుగా మాట్లాడుచు తన చిత్తాన్ని వేర్వేరు వ్యక్తులకు నోటిమాట ద్వారా తెలియజేస్తు యుండేవాడు. అయితే తన చిత్తాన్ని మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు లిఖితపూర్వకముగా తెలియపర్చాడు. ఆ లేఖనములు దేవుని యెడల మానవుని బాధ్యత, మానవుని యెడల మానవుని బాధ్యతను కూడా తెలియజేయుచున్నవి. పాత నిబంధన లేఖనములు క్రీస్తును గూర్చి బాహాటముగా తెలియజేయుచున్నవి. అందువలన యేసు యూదులతో, "లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యని చెప్పారు( యోహాను 5:39). "ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొన వలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి" (2పేతురు 1:21).

దేవుడు మానవుని జీవమునకు భక్తికి కావలసినదంతటిని లేఖనములలో బయలుపర్చాడు. మానవుని నైతిక, ఆత్మీయ జీవన పరిమాణము లేఖనము మాత్రమే. అందువలన క్రైస్తవులు లేఖనముల నతిక్రమింపరాదని హెచ్చరింపబడ్డారు (1కొరింథీ 4:6). నేటి క్రైస్తవలోకమంతయు లేఖనముల ప్రాధాన్యత నెరుగనందువలన గందరగోళముగాయున్నది. క్రీస్తుకాలము నాటి యూదులుకూడా అంతే. అందువలన మీరు "లేఖనములను గాని, దేవుని శక్తినిగాని ఎరుగక పొరబడుచున్నారని" యేసు చెప్పెను (మత్తయి 22:29). ఉదాహరణకు: బాప్తిస్మమనగా నీటిలో ముంచుటయని లేఖనములు చెప్పుచుండగా, కొందరు నీళ్లు చిలకరించి దానిని బాప్తిస్మమనుచున్నారు. వారు లేఖనములను ఎరుగక పొరబడుచున్నారు. రక్షింపబడుటకు ఒకడు క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొందవలెనని (మార్కు 16:16). లేఖనములు చెబుతుయుంటే, బాప్తిస్మమక్కరలేదని కొందరు చెబుతారు. వారు లేఖనముల నెరుగక పొరబడుచున్నారు. ఆరాధనలో దేవుడు పాటలు పాడుటను కోరుచున్నట్లు లేఖనములు చెబుతుయుంటే, కొందరు వాద్యములనుపయోగిస్తారు. లేఖనముల నెరుగక పొరబడుచున్నారు.

క్రైస్తవులు, క్రీస్తు సంఘము దేవుడు బయలు పర్చిన సత్యమార్గము నుండి తొలగి పోకుండు నిమిత్తం లేఖనములు ప్రయోజనకరములు. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2తిమోతి 3:16,17).

మండపేట క్రీస్తు సంఘ సువార్తికులు కొల్లి కామేశ్వరరావ్‌గారు, స్థానిక సంఘము చక్కని భోజన పానీయముల నేర్పరచిరి. సోదరులు కొల్లి సుగుణాకర్ గారు వందన సమర్పణ చయగా, M. చిట్టి మోజెస్‌గారి ప్రార్థనతో మార్చినెల సదస్సు ముగిసెను. సవార్తికులు తమ తమ గ్రామములకు సంతోషముతో తిరిగి వెళ్లిరి.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications , Kakinada - 533 004.

PRINTED BOOK - BOOK POST

From:

SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To